విజయ

కల్యాణి పెళ్ళి నిర్ణయమైంది. అమ్మకూ నాయనమ్మకూ ఎంతో సంతోషం కలిగింది. "ఖర్చులు కలిసి వస్తాయి. విజయ పెళ్ళికూడా ఇందులోనే చెయ్యాలి" అంటూ ప్రారంభించింది నాయనమ్మ.

"నిజమే ఈడేరి ఇంతవున్న పిల్లకు ఇంకా చదువులేమిటి? దానికీ ఏదో సంబంధంచూసి రెండు పెళ్ళిళ్ళూ కానిస్తేసరి" అంటూ వంత పాడింది అమ్మ. మనస్ఫూర్తిగా ఇష్టం లేకపోయినా విజయ తండ్రి రామారావుగారు ఆడవాళ్ళ మాటలు వినివినీ మనసుని సరిపెట్టుకుని విజయకు కూడా సంబంధం చూడటం ప్రారంభించారు. వరుడి ఫోటోతెచ్చి చదువుకొంటూన్న విజయ కళ్ళముందుపెట్టి అభిప్రాయం అడిగేవరకూ తనకు పెళ్ళి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సంగతే తెలీలేదు విజయకు. తెలిసిన క్షణం నిప్పుకణికలా మండిపడింది. ఇప్పట్లో తన చదువు ఆగటానికి వీల్లేదని మొరాయించింది. "నాకిప్పుడు పెళ్ళీగిళ్ళీ ఏం అక్కర్లేదు.

చదువుకుంటాను" అని ఖచ్చితంగా చెప్పేసింది. తన విషయాలలో తనకే యిష్టంలేని పనులు జరగడం విజయ సహించదు. తిరస్కరిస్తే కలగబోయే విషమ పరిస్థితి ఎదుర్కోవటానికి ఈషన్మాత్రం భయపడదు. మనసు అంగీకరించని వ్యవహారాలకు ససేమిరా తలవంచదు. పదిహేనేళ్ళ విజయ, అయిదవఫారం చదువుతూన్న విజయ ప్రతి విషయం స్వయంగా ఆలోచించగలదు. సమంజసమైన నిర్ణయాలు చేసుకోగలదు. ప్రతి వ్యక్తికీ స్వంతభావాలూ, ఒక నిర్దుష్టమైన వ్యక్తిత్వమూ వుండితీరాలంటుంది విజయ. తన భవిష్యత్తు తను మెలకువగా నిర్ణయించుకోగలననే ఆత్మవిశ్వాసం వుంది విజయలో.

రామారావుగారి రెండో అమ్మాయి విజయ. పెద్దది కళ్యాణి. లక్షణంగా కుదురుగా నాయనమ్మా, అమ్మా చెప్పినట్టేవిని "గుణవంతురాలవే కళ్యాణీ" అనే బిరుదు తెచ్చుకుని, ఏడేళ్ళ క్రిందటే ఐదో తరగతి బడికీ, పుస్తకాలకూ వీడ్కోలుచెప్పి, ఈ నాటికీ కొత్త కొత్త అందాలతో పదిహేడేళ్ళ రాధ చిన్నదానిలా కళ్యాణానికి సిద్ధంగా కూర్చుంది. ఇక మూడోది శారద పదేళ్ళది అమ్మ దగ్గర అల్లరిచేస్తూ, నాన్న దగ్గర గారాం కుడుస్తూ, నాయనమ్మ దగ్గర మారాం పెడుతూ, విజయక్కయ్య దగ్గర భయపడుతూ, పెద్దక్కయ్యతో కబుర్లు చెబుతూ, అన్నయ్యతో బజారుకెడుతూ, అన్నిటిమధ్యా మొక్కుబడిగా నాలుగో తరగతి పావనం చేస్తూంది.

నలుగురి సంతానంలోనూ విజయపైన తండ్రికి ప్రత్యేకమైన అభిమానం, అనురాగం. విజయవంటి కూతుర్ని కన్నందుకు ఆయన ఎన్నోసార్లు గర్వించిన సమయాలున్నాయి. విజయను చూస్తుంటేనే ఆయనకు ఏదో తృప్తితో మనసు పరవశమౌతుంది. కూతురికే విషయమైనా నయాన్నేగానీ భయానచెప్పటం ఆయనకు చేతేకాదు. తండ్రి హోదాతో బిడ్డలను హడలగొట్టటం, ఆజ్ఞాపించటం ఆయన అభిమతంకాదు. పిల్లల మనస్తత్వాలు అర్థం చేసుకోగలిగిన తల్లి తండ్రులుండటం సామాన్యం కాదు అంటుంది విజయ స్నేహితురాంద్రతో. చిన్నతనంనుంచీ విజయ

భావాలకూ ఇంటి వాతావరణానికీ చుక్కెదురు. తండ్రి చేయూతే విజయ ఒక వ్యక్తిత్వం ఏర్పరుచుకోవడానికి కారణమైంది. కూతురు తెలివైందనీ, చక్కగా చదువుతుందనీ అనుకున్నప్పుడు తల్లి సంతోషిస్తుందిగానీ ఆడపిల్ల అంత గడుగ్గాయిగా తయారుకావటం ఆవిడ ఆమోదించదు. ఇక నాయనమ్మ సనాతనత్వానికీ మనవరాలి అధునాతనత్వానికీ తరుచూ ఘర్షణ జరుగుతూనే ఉంటుంది. శరవేగంతో మారిపోతూన్న కాలానికి విజయను ప్రతిబింబంగా ఊహిస్తూ — "ఎంత తేడా! ఎంత తేడా! అంటూ ఆశ్చర్యంతో రాయిలా అయిపోతూ ఉంటుంది నాయనమ్మ. విజయ తేలిగ్గా నవ్వేసి నాయనమ్మ భుజాలు పట్టుకుఊపి — "నాయనమ్మా నువ్వు ఉత్త చాదస్తం మనిషివి" అంటూ పకపకా నవ్వేస్తుంది.

ఎంతటి గడ్డు సమస్యగానీ విజయముందు చిల్లిగవ్వ! గడిపరక! పెళ్ళి ప్రయత్నం మెరుపులావచ్చి మీదపడ్డా నిర్లక్ష్యంగా త్రోసిపారేసింది. విజయ తిరస్కారంతో మరోసారి వాతావరణం వేడెక్కింది. అమ్మా నాయనమ్మా ఉమ్మడిగా యుద్ధానికి సిద్ధమయ్యారు.

"నీ ఇష్టం నీదేగానీ మంచీచెడ్డా, పెద్దాచిన్నా ఏం లేదన్నమాట? ఈడేరిన దానివి ఇంటవున్నావనీ, ఖర్చులో ఖర్చు కలిసి వస్తుందనీ లక్షణంగా పెళ్ళిచేసుకోమంటే...."

అమ్మా! నీ లక్షణాలకో నమస్కారం. నువ్వు లక్షణంగా పెళ్ళి చేసే దానికన్నా సలక్షణంగా చదువుకొంటున్నాను. నాకేమీ ఇరవైలూ, ముప్పైలూ దాటలేదు. అక్కయ్య పెళ్ళి నా పెళ్ళి ఒక్కసారి జరిగి నీ ఖర్చులు తగ్గడానికి మే మిద్దరం ఒక్కసారే పుట్టలేదు. ఇంతకన్నా నేనేం చెప్పను? నాకు ఎంతో చదువుకోవాలనీ, ఏదో కావాలనీ ఉంది. నా కోరిక నీతో కాకపోతే ఎవరితో చెప్పుకోను? నా చదువు మానిపించి ఏదో చేస్తానంటావు. నీ మనస్సెలా ఒప్పిందమ్మా!

"పోనీ అలాగే చదువుకో. పెళ్ళిచేసుకుని చదువుకొంటున్న వాళ్ళు ఎంతమంది లేరు? ఈ మాత్రానికే పెళ్ళి వద్దనటం దేనికే విజ్జీ?"

"పెళ్ళి చేసుకున్నాక చదువు చదువే నాయనమ్మా! నాకు అది ఇష్టంలేదు. అయినా నాకేమంత వయసు మించిపోయిందని మీ పట్టుదల? పదిహేనేళ్ళకు పెళ్ళి— పదహారేళ్ళకు తల్లీనా? నాకేం నచ్చలేదు నాయనమ్మా!"

"ఇదేం విడ్డూరమే పదిహేనేళ్ళంటే ఇంకా చిన్నతనమా? నా పెళ్ళి తొమ్మిదోయేట జరిగింది. అప్పుడు మీ తాతకు పాతిక నిండాయట. ఈడూ జోడూ సరిపోయిందని నలుగురూ ఎంతో ముచ్చట పడ్డారు." నాయనమ్మ కించిత్తు సిగ్గుపడుతూంటే విజయ సగంలో అడ్డుతగిలి "నాకు తెలీక అడుగుతాన్నూ, మీ ఇద్దరికీ ఈడూ జోడూ సరిపోతే పైవాళ్ళ కెందుకూ ముచ్చట" అంది చెంపకు చెయ్యి చేర్చుకొంటూ.

"ముచ్చట కాదుటే? చూడ లక్షణంగా ఏది జరిగినా ముచ్చటే నువ్వు చిన్నతనం అంటూ గొడవ చేసూంటేనూ చెప్పుకొస్తున్నా.... ఆ పెళ్ళి అయిందా? పన్నెండోయేట కొబోలు మీ నాన్న కడుపులో పడ్డాడు."

"అవునవును. నువ్వువెళ్ళి ఆస్పత్రిలో పడ్డావు. సమయానికి వైద్య సౌకర్యం లేకపోతే పన్నెండేళ్ళ పసితల్లీ బిడ్డా హరోంహరా! ఎందుకు నాయనమ్మా తాతలనాటి చాదసాలు చెపుతావు? నీకూ నాకూ రెండుతరాల అంతరం ఉంది. తెలుసా? నీ పెళ్ళి తొమ్మిదోయేట జరిగితే నా పెళ్ళి పందొమ్మిదోయేట జరగాలి. అంతే!" విజయ లేచి వెళ్ళిపోయింది.

నాయనమ్మ లబో దిబోమని మొత్తుకొంది. "చదవనేర్చిన ఆడదీ, వంటనేర్చిన మగవాడూ ఎందుకు పనికి వచ్చినట్టు? గుంటవెధవ దగ్గ ర్నుంచీ వాళ్ళ నాన్నే దాన్ని పాడుచేశాడు. కొమ్ములిచ్చాడు. పొడవటా నికి సిద్ధంగా వుంచి. ఎన్ని చెప్పుందీ! ఎన్ని చెప్పుందీ! దీని నదువుమండా! ఏం ఉద్యోగం వెలగబెడుతుంది? దీనికి గుణం గుట్టూ ఎలా వస్తాయి?" అంటూ లక్ష తిట్టిపోసింది. కానీ ఏమీ లక్ష్యపెట్టకుండా విజయ బాత్ రూంలోకెళ్ళి నీళ్ళు తోడుకోసాగింది. నాయనమ్మ గబగబా దొడ్లోకెళ్ళి — నీ ఆగడం మీ నాన్నకు చెప్పమంటావుటే? అంటూ అరిచింది కోపంకొద్దీ.

"అక్కర్లేదు నేనే చెపుతాను" అనేసి దభాలున బాత్‌రూం తలుపులు వేసుకొంది విజయ. నాయనమ్మ హతాశురాలై వెనక్కు తగ్గింది. విజయ నెగ్గింది. కూతురి ఉద్దేశ్యం తెలుసుకున్న రామారావుగారు వెంటనే తన ఉద్దేశం మార్చుకున్నారు. మాటమాత్రంకూడా కూతుర్ని మందలించలేదు. విజయ పెళ్లి రద్దయిపోయింది.

కళ్యాణి పెళ్ళి లక్షణంగా జరిగిపోయింది.

* * *

పెళ్ళి సందడిలో కొత్తఅల్లుడి సంతోషంతో అంతా విజయమీద కోపం మరిచిపోయారు. పరిస్థితి చల్లబడిపోయింది. విజయ శారదను మొదటి ఫారంలో చేర్పించింది. ఆఖరి సంవత్సరం అంతా భవిష్యత్తుమీద ఏవో కోరికలతో ఎన్నో ఆశలతో శ్రద్ధగా చదివింది విజయ. లాంఛనంగా తను ప్యాసయ్యాననే ఋజువుకోసం పరీక్షా ఫలితాలు చూసుకోవలసిందేగాని, అంతకు ముందే తాను మంచి మార్కులతో పాసౌతానని విజయకు బాగా తెలుసు.

పరీక్షాఫలితాలు తెలసినరోజు ఇంటినిండా సంతోషం ఆవరించుకొంది. నాయనమ్మకూడా విజ్జీని మెచ్చుకొంది. అమ్మ గర్వపడింది. అన్నయ్య ఏదో బహూమతి ఇచ్చాడు. అన్నిటికీ విజయ చిరునవ్వుతో సమాధానాలు చెప్పింది. విజయ మనసు ఎన్నో ఊహలతో నిండిపోయింది. ఇక తనేం చెయ్యాలి? ఇప్పటికి ఒక ఘట్టం గడిచింది. స్కూలు చదువు ముగిసిపోయింది. కాలేజీలో చేరటమా? నాన్నగారు ఏమంటారు? తనకు చదువు చెప్పిస్తే వృథా ఎప్పుడూ కాదు. ఎంత కష్టమైన చదువు కానీ తను చదవలేదనే జంకులేదు. తను చదవాలి. ఎంతో చదవాలి. అంతులేకుండా చదవాలి. చదివీ చదివీ చదువు అంటే విజయ అన్నట్టు కావాలి. కాలేజీలో చేరాలి. డాక్టర్ కావాలి. ఏం కాలేదా? ఈ డాక్టర్లంతా ఒకప్పుడు తనలా స్కూల్ ఫైనల్ వాళ్ళు కారా! .... విజయ ఎన్నో ఆలోచనలు చేసింది. ఆ పగలంతా చాలా ముభావంగా తిరిగింది. రాత్రి నాన్నగారు భోజనంచేసి

వెళ్ళి వీధి గదిలో చదువుకొంటూ కూర్చుంటే విజయ కొంత సేపు తటపటా యించి వెళ్ళి తండ్రి దగ్గర కూర్చుంది.

"అన్నం తిన్నావా అమ్మా!"

"తిన్నాను నాన్నా!"

కొంత విరామం...."నీ స్నేహితురాళ్ళు అంతా పాసయ్యారా?"

"పాపం సుశీల ఫెయిలయ్యింది."

"........."

"నాన్నా! విమల కాలేజీలో చేరుతుందట" విజయ తండ్రి మొహం లోకి సూటిగా చూడలేకపోయింది. తలదించుకునే అంది. కాని ఆ తండ్రి మొహం ఎంత చిన్నబోయిందో కూతురు చూసిఉంటే ఆ పైన సంభాషణ పెంచగలిగేది కాదేమో! నాన్నగారి మౌనం విజయని ప్రోత్సహించింది. నాన్నా! కాలేజీ సీటుకు దరఖాస్తు పెట్టనా?" ప్రతిమాటలోనూ ప్రతి అక్షరం లోనూ శతవిధాలా తన కోరిక తెలియజేస్తూ, తలఎత్తి తండ్రి కళ్ళలోకి చూస్తూ మనసు బయట పెట్టింది విజయ. నాన్నగారి మొహం మరీకాంతి విహీనమైపోయింది. విజయ హృదయం కొట్టుకులాడింది. ఆశ నిరాశల మధ్య ఊగిపోయింది. కళ్ళు ఎత్తి అలాగే చూస్తూ ఉండిపోయింది.

"అమ్మా! విజయా! నువ్వు చిన్నదానివేగాని నన్ను క్షమించు తల్లీ!"

"నాన్నా!" ఆశ్చర్యంతో అతి నెమ్మదిగా అంది విజయ.

"అవునమ్మా! నువ్వు ఇలా అడగటానికి వస్తావని నాకు తెలుసు. నువ్వు పరీక్షలు రాసింది మొదలు నేను ఆలోచించని రోజు లేదు. నీ అభివృద్ధికీ, నీ మేధాసంపత్తికీ మనసారా సంతోషించేవాళ్ళు ఎవరైనా ఉంటే మొదటి వ్యక్తిని నేనే. నీలో అపారమైన తెలివితేటలు ఉన్నాయి. అంతులేని శక్తిసామర్థ్యాలు ఉన్నాయి. అన్నీ నేను అర్థంచేసుకున్నా నమ్మా! కానీ తల్లీ!" నాన్నగారు క్షణకాలం ఆగారు. విజయ జరగబోయే దంతా సున్నితంగా అర్థం చేసుకొంది. గుండెలు బద్దలైపోకుండా పట్టు కొంది.

"చూడమ్మా విజయా! మన ఆర్థికస్థితి నీకు తెలీదా? అన్నయ్యకు కాలేజీ చదువులు చదివించలేక కదా కోర్సుకు పంపాము? ఇంతకన్నా నీకు నేను ఏమీ చెప్పలేను. నువ్వు ఆలోచించి చూడు విజయా? ఎంత మాత్రం అవకాశాలు ఉన్నా నీ అభివృద్ధిని ఆటంకపరుస్తా ననుకుంటు న్నావా తల్లీ! నీవంటి కూతుర్ని పొందికూడా సలక్షణంగా పెంచుకోలేని దౌర్భాగ్యుణ్ణి విజయా!" నాన్నగారు అరచేతిలో నుదురుపెట్టుకొని బాధగా రాసుకొంటూ మరి మాటలాడలేనట్లు మౌనం వహించారు. నాన్న అన్న ప్రతిమాటనూ శ్రద్ధగా, గంభీరంగా వింది విజయ. అర్థం చేసుకోటానికి ప్రయత్నించసాగింది. పేకముక్కల మేడ చెదిరిపోతూంటే చూడగలి గింది.

నాన్నగారు విజయ తల నిమురుతూ —"విజయా నీకు బాధగా ఉందికదూ? నన్ను ఏం చెయ్యమంటావు తల్లీ?" అంటూంటే విజయ సహించలేకపోయింది. "నాన్నా! అంతా నీయిష్టం నాన్నా! నేను వెళ్తాను" అనేసి లేచి చరచరా వెళ్ళిపోయింది. తండ్రి కళ్ళు మూసుకొంటే నీటి బొట్లు రాలిపడ్డాయి.

విజయ ఏడిచింది. ఊహ తెలిశాక తొలిసారిగా ఏడిచింది. ఆశలు! ఎన్ని ఆశయాలు! ఎన్ని ఆలోచనలు! ఎంత విద్యాకాంక్ష! ఎన్ని నమ్మ కాలు! – అన్నీ ఏం కావాలి? ఎలా తీరాలి? భగవాన్! ఏమిటీ దౌర్భాగ్యం? ఏది కావాలని దేవిరిస్తే అదే కరువు చేస్తావు? అక్కరలేదని అసహ్య పడితే అంటకడతావు? ఇదా న్యాయం? ఈకాంక్ష ఎలా తీరాలి? ఈ బాధ ఎలా పోవాలి?— విజయ ఎంతోసేపు ఏడ్చింది. ఏడిచావనీ ఏడుస్తున్నా నని— అర్థమైనప్పుడు అదిరిపడింది. పిరికిగా ఏడవట మనేది విజయ దృష్టిలో హీనం. మనిషికి కన్నీళ్లు రానివ్వని మనోధైర్యం కావాలి — మనిషికి కన్నీళ్ళను ఆపుకోగలిగే అంతశ్శక్తి పెరగాలి. ఆ క్షణంవరకూ విజయ అలానే అనుకొనేది ఏడిచేవాళ్ళను చూస్తే చిరాకుపడేది. ఈ ఆడ వాళ్ళు అస్తమానూ ఎందుకు ఏడుస్తూఉంటారు? ఆడవాళ్ళం సుమా అని ఋజువు చేసుకోటానికా? ఏడవకుండా భరించగలిగే సామర్థ్యం లేకనా?

అందుకే ఆడదంటే అందరికీ తేలిక అభిప్రాయం. ఏడవటం మహా చెడ్డగా భావించే విజయ—కన్నీళ్ళను అసహ్యించుకొనే విజయ ఏడ్చింది. తనివితీరా ఏడ్చింది, కానీవిజయ స్వానుభవంతో ఒక నగ్నసత్యం తెలుసు కోగలిగింది. జీవితంలో ప్రతిక్షణమూ సిద్ధాంతాల ప్రకారమే గడవదు. ఏ నిమిషమైనా సహజతలకు లొంగిపోవలసి ఉంటుంది.

విజయ ఆశలకు ఆటంకం కలిగింది. మనసులో రేగిన ఉద్రేకాన్ని కన్నీరు కొంతవరకూ కడిగివేసింది. కళ్ళు మూసుకొని నుదుటి మీద చెయ్యి వేసుకు పడుకొంటే నాన్నగారు బాధతో నుదురు రాచుకోవటం కనిపించింది.

"నువ్వు చిన్నదానివేగాని నన్ను క్షమించు తల్లీ"—నాన్న ఎంత బాధపడ్డారు!—"నాన్నా! నువ్వే నన్ను క్షమించాలి. తాహతు తెలుసుకోలేని కోరికలు కోరి నిన్ను క్షోభపెట్టాను. ఇది నా దురదృష్టంగానీ నువ్వు చెయ్యగలిగిందేమీలేదు. నీమీద నాకు కోపం లేదు" అని వెంటనే వెళ్ళి నాన్నకు చెప్పాలనిపించింది.

"అవును. నాన్న మాత్రం ఏం చెయ్యగలడు? అన్నయ్య కోర్సు పూర్తికావాలి. అక్కయ్యకు పురుడూ పుణ్యం జరుపుతూ ఉండాలి. శారదను స్కూలుఫైనలు వరకేనా చదివించాలి. ఈలోపు ఇంటి ఖర్చులన్నీ సర్దుకురావాలి. చెయ్యబోయే పెళ్ళిళ్ళకు కట్నాలు కూడబెట్టాలి. వీటి కన్నిటికీ జతగా తనకాలేజీ చదవా? ఎవరికి సాధ్యం? ఒక్కవ్యక్తి సంపాదన, ఒక గుమాస్తా రాబడీ—ఎన్ని పనులు జరుపుతుంది? పెద్దవాళ్ళ కష్టసుఖాలు గమనించకుండా గాలిలో మేడలు కట్టుకోవటం, తీర్చుకోలేని కోరికలు పెంచుకోవటం వివేకమా? ఇంతమాత్రం చదువగలిగినందుకు సంతోషించకూడదా?—విజయ గంటలతరబడీ రోజుల తరబడీ ఆలోచించింది. ఒక్క ఆలోచించటంతప్ప తను చెయ్యగలిగిందేమీ లేదనుకొంది. ఒకనాడు తండ్రి స్వయంగా పిలిచి...."నీ చదువు విషయం ఏమనుకుంటున్నావమ్మా! నీకు బాధగాఉంటే చెప్పు. ఎలాగో తంటాలు పడతాను"

అన్నారు. "వద్దు నాన్నా నువ్వేమీ బాధపడవద్దు. నేను సంతృప్తిపడటం నేర్చుకుంటాను" అంది నెమ్మదిగా.

నిజంగానే విజయ సంతృప్తిపడింది. కాలేజీ విషయం మరిచిపోయి మనసు నిర్మలం చేసుకొనటానికి ప్రయత్నించింది. మరొక రకమైన బాధ్యతలు మీదపెట్టుకుని సంతోషంగా ఉండాలని నిర్ణయించింది.

• • •

మూడు సంవత్సరాలు దాటిపోయాయి. పరికిణీలు వదిలి చీరల్లో ప్రవేశించిన విజయలో అందం, హుందాతనం అధికమయ్యాయి. గడిచి పోయిన కాలమంతా విజయ ఎన్నోవిధాల సద్వినియోగపరిచింది. హిందీ పరీక్షలు పాసై ధారాళంగా మాట్లాడటం నేర్చుకొంది. లైబ్రరీ మెంబరై అంతులేనన్ని గ్రంథాలు చదివింది. రేడియో గాయకురాలిగా ఘనమైన ఖ్యాతి పొందగలిగింది. శాస్త్రీయ సంగీతం అంటే ఏమీ ప్రవేశం లేక పోయినా విజయ ఎప్పుడూ మధురకంఠంతో గాలిపాటలు పాడుకొంటూ కూనిరాగాలు తీసుకొంటూ ఉండేది. విజయ రేడియో నాటకాల్లో నటిస్తా నంటే నాయనమ్మ తిట్టిపోసింది. కాని మొదటిసారి మనమరాలు పాడిన పాట రేడియోలో వింటూ సంభ్రమాశ్చర్యాలతో ముక్కుమీద వేలు వేసు కొంది. "ఎంతైనా విజ్జీ తెలివైంది సుమీ" అంటూ గుసగుస లాడింది కోడలు చెవిలో. విజయ తను సంపాదించిన డబ్బుతో స్వయంగా రేడియో కొన్నప్పుడు నాయనమ్మ తనను తనే తిట్టిపోసుకుంది. మనవ రాలి బుగ్గలు నిమిరి ముద్దుపెట్టుకొంది.

విజయ ఏదో కుతూహలంకొద్దీ చిన్న చిన్న కథలు రాయటం కూడా ప్రారంభించి పేరు తెచ్చుకుంది. అక్కడితో కొంత నమ్మకం కుదుర్చుకొని తన రచనాశక్తిని అభివృద్ధి చేసుకోవాలని సంకల్పించు కొంది. అన్నిటితోపాటు నాయనమ్మ దగ్గర మడికట్టుకొని పచ్చళ్ళు నూరటం, అన్నాలు వార్చటం, దేవుడిముందు నైవేద్యం పెట్టడంకూడా తెలుసుకొంది. విజయకు తన బాధ్యతలన్నీ చాలాతృప్తి కలిగిస్తున్నాయి,

ఎప్పుడూ ఆనందంగా, హడావిడిగా ఉండే విజయ అంటే ఇంట్లో అంద రికి ప్రాణమే.

ఒకనాడు నాయనమ్మకు తటాలున ఏదో గుర్తు వచ్చింది. "అవుతే విజ్జీ, నీ కింకా పందొమ్మిదో ఏడు రాలేదుటే?" అంటూ ఆరా తీసింది. విజయ ఏదో గ్రహించినట్లు చిరునవ్వు నవ్వి—వెళ్ళిపోతున్నదికూడా. ఆ సంగతి ఇప్పుడెందుకు నాయనమ్మా" అంది.

"ఎందుకేమిటే? ఇంకా ఎన్నాళ్ళిలా ఉంటావు? ఎన్ని అందాలు ఉన్నా ఆ లోటు లోటే తల్లీ! ఈడు వచ్చిన ఆడదానికి ఆమూడు ముళ్ళూ పడితేగానీ....

"అబ్బబ్బ! నాయనమ్మా! మూడు ముళ్ళు వేయిస్తావో, ముప్పై ముళ్ళు వేయిస్తావో ఇక అంతా నీ ఇష్టం. నా అభ్యంతరం ఏమీ లేదు" అంటూ నవ్వింది విజయ.

నాయనమ్మ గంపెడు సంతోషంతో పెళ్ళి పెద్దరికం స్వీకరించింది. ఆ క్షణంనుంచీ ఎన్ని సంబంధాలు చూసినా విజ్జీకి తగనివిగా నాయనమ్మకే సంతృప్తి కలగటంలేదు. "దీని పెళ్ళి ఒక సమస్యవుతుందా ఏమిటే?" అనుకొంది నాయనమ్మ.

* * *

ఓనాడు రామం రేడియో స్టేషన్‌లో విజయకు తన వెంట వచ్చిన స్నేహితుడు శ్రీనివాస్‌ను పరిచయం చేశాడు. విజయ చిరునవ్వుతో 'నమస్తే' చెప్పింది, శ్రీనివాస్ ప్రతినమస్కార ఋణం తీర్చుకున్నాడు.

"విజయా! ఇంతవరకు ఇటు మనమిద్దరం అటు మేమిద్దరం విడివిడిగా స్నేహితులం. ఇప్పట్నుంచీ ముగ్గురం ఉమ్మడిగా స్నేహి తులం. అవునా!" అంటూ నవ్వాడు రామం.

"అవునన్నయ్యా!" అంది విజయకూడా నవ్వుతూ.

ఆరోజు విజయ, రామం కలసి పాడుతుంటే శ్రీనివాస్ ఆశ్చ ర్యంగా విన్నాడు. ప్రోగ్రాం కాగానే సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

విజయ ఇంటికి బయిల్దేరుతూంటే విజయా, నేనూ అటే వస్తాను, నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" అంటూ విజయను అనుసరించాడు రామం.

"ఏమిటి చెప్తానన్నావ్?" అంది విజయ దారిలో.

"ఇలా నడుస్తూకాదు, చాలా మాట్లాడాలి. కాస్సేపు పార్కులో కూర్చుందాం పద" అన్నాడు రామం.

"అంత గొప్ప విషయమేమిటి బాబూ? సరే పద" అంటూ చెట్లలోకి దారి తీసింది విజయ. "ఇక ఇప్పుడు చెప్పు వింటాను" అంది పచ్చగడ్డిలో చతికిలపడుతూ. రామం ప్రక్కన కూర్చున్నాడు.

"ఇందాక పరిచయం చేశాను, శ్రీనివాస్‌ని.... అతణ్ణి గురించి నీ ఉద్దేశ్యం ?"

"బావుంది. మధ్య అతన్ని గురించి నా ఉద్దేశ్యం ఏమిటి?"

"తనికింకా పెళ్ళికాలేదు. ప్రస్తుతం అదే సమస్యలో ఉన్నాడు."

"ఉండనీ. నా కెందుకు ?"

"నీ గడుసుదనం తెలుసులెద్దూ. ప్రస్తుతం నువ్వూ అదే పరిస్థితిలో ఉన్నావు. అందుకే నిన్ను వాడికి చూపించాను."

"అలాగా? ఎవరినడిగి నన్ను చూపించావు ?"

"నీకు చక్కటి పెళ్ళికొడుకును చూడమని మీ నాయనమ్మ నెల్లాళ్ళ క్రిందటే చెప్పిందే!"

"ఓహో! అయితే పెళ్ళి పెత్తనమంతా మీరిద్దరే చెలాయిస్తున్నారన్నమాట" అంటూ నవ్వింది విజయ.

"నేను హాస్యానికి చెప్పటంలేదు విజయా! నిజంగా మీ ఇద్దరికీ ఇష్టమైతే ఈ పెళ్ళి జరిపించాలని నా ఉద్దేశం. శ్రీనివాస్ ఎం. ఏ. పాస య్యాడు. లైఫ్ ఇన్సూరెన్స్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్నాడు. సభ్యత, సంస్కారాలు తెలిసినవాడు. 'ఊ' అంటే కోటిమంది అమ్మాయిలు, వేలకొద్దీ కట్నాలు! కాని వాడికా దృష్టిలేదు. ఎంతమందిని చూసినా వాడికి

సంతృప్తి కలగడంలేదు. ఇంటా బయటా వాడి పెళ్ళి గురించి గొడవే. వాడికి వయస్సు వచ్చింది. కాబట్టి పెళ్ళి చేసుకోవాలని, పెళ్లాంతో హాయిగా సినిమాలూ–షికార్లూ–జల్సాలూ–ఝామ్మని తిరగాలని ఉంది. కాని అసలు పెళ్ళికూతురు దగ్గరే వచ్చిపడింది చిక్కు. తొందరపడి ఏ నిర్ణయమూ చేసుకోలేక పోతున్నాడు. తను పెళ్ళి చేసుకుంటే అది సుఖమయం అవుతుంతో కాదో అనేది వాడి భయం" రామం ఆగాడు—

విజయ నవ్వింది "బావుంది. అయితే ఏం చేస్తాడట?"

"మరి విను. అదేకదా నీకు చెప్పేది. మొన్న ఒకనాడు మీ ఇంట్లో కూర్చుని నేనూ, వాడూ మీ వదినా ఏవేవో కబుర్లు చెప్పుకొంటున్నాం. అందులోనే వాడి పెళ్ళి ప్రసక్తి వచ్చింది. వాడు తన మనసులోని విషయం ఏదో చెప్పాడు. దానికి మీవదిన నీలాగే నవ్వుతూ "బావుంది అన్నయ్యా! అంతా నీలా భవిష్యత్తు తలచుకొని భయపడతారా? నీకంత భయమైతే పెళ్ళికూతురితో నీ మనసులో విషయాలన్నీ ముఖాముఖి మాట్లాడి నీకు నచ్చితేనే పెళ్ళి చేసుకోరాదూ?" అంది హాస్యంగా.

"అమ్మో! శ్రీనివాస్‌గారికి స్వయంవరం కూడానా? జాగ్రత్త రోయ్! ఈ రోజుల్లో అమ్మాయిలు మరీ గడుగ్గా ఉంటున్నారు" అంటూ నవ్వాను నేను. మాతోపాటు వాడు కూడా నవ్వాడు. ఆ తర్వాత వాడేం ఆలోచించుకున్నాడోగానీ అదే పట్టుపట్టి కూర్చున్నాడు. "పెళ్ళి చూపులంటూ ఓ నిమిషంపాటు మొహాలు చూసుకున్నంత మాత్రాన ఏం తెలిసిపోతుంది? నేను స్వయంగా వధువుతో మాట్లాడి పెళ్ళి చేసుకుంటాను అంతే" అంటూ చెప్పుకొచ్చాడు. వాడి సమస్య గురించి ఆలోచిస్తే చటుక్కున నువ్వు గుర్తుకొచ్చావు విజయా! ఇన్నాళ్ళూ నిన్ను తెలిసిఉండి కూడా వాడికీ సంగతి చెప్పనందుకు నన్ను నేనే తిట్టుకున్నాననుకో. వెంటనే నా ఊహ మీవదినకు కూడా చెప్పాను. "నిజంగా ఈ పెళ్లి జరిగితే ఎంతో అందంగా ఉంటుంది" అంది. అందుకే వాణ్ణి ఏదో మిషమీద తీసుకొచ్చి నిన్ను చూపించాను. ఇంతవరకూ వాడికి ఈ సంగతి చెప్పలేదు.

ముందు నీ ఉద్దేశ్యం తెలుసుకొని వాడికి చెప్పాలనుకుంటున్నాను. ఏమంటావు? అసలు వింటున్నావా నేను చెప్పింది?" అన్నాడు రాము ముగిస్తూ.

"ఆ. ఆ. వినకేం? అప్పుడే అంత పరధ్యాన్నం రాలేదులే" అంటూ నవ్వి — "ఇంతకూ నన్నేం చెప్పమంటావ్?" అంది.

"శ్రీనివాస్ నీకు నచ్చాడా?"

"ఛ. పోదూ!"

"చెప్పు విజయా! అన్నయ్య దగ్గర చెల్లి సిగ్గుపడుతుందా?"

"నచ్చితే నన్నేం చెయ్యమంటావ్?"

"అతనితో మాటాడుతావా?"

"ఏమిటి మాట్లాడేది?"

"అతనే అడుగుతాడు. నువ్వు చెప్పు. నీకు కావలసింది అడుగు-అతను చెప్తాడు. దాదావు ఇంటర్వ్యూ అన్నమాట."

"బావుందిలే."

"చెప్పు మరి."

"ఎక్కడ మాట్లాడేది?"

"మీఇష్టం. మా ఇంట్లో అయినాసరే! ఈ పార్కులోనైనా సరే."

"నాకు సిగ్గు బాబూ! వదిన హాస్యం చేస్తుంది!"

"ఛ! దానికిమాత్రం తెలీదేమిటి? నీకా భయం ఏమీ వద్దు."

"అయితే ఈ సంగతి నాన్నకి చెప్పవద్దా?"

"ముందేం వద్దు. ఇంటర్వ్యూ కానీ! మీరు పరస్పరం ఇష్టపడితే తర్వాత నేను చెప్తాను. పెద్దవాళ్ళద్వారా నిశ్చయం చేద్దాం. ముందే చెప్పేస్తాం అనుకో. ఒకవేళ ఏ కారణంచేతనయినా మీ ఇద్దరికీ ఇష్టం లేకపోతే అప్పుడేం బావుంటుంది?"

"అవునులే. ఈ సంగతి నాయనమ్మ వింటంటే తిట్టిపోస్తుంది."

"అయితే నువ్వు సిద్ధం అన్నమాట. ఈ రాత్రే వాడికి అంతా చెప్తాను. రేపు ఏ కబురూ నీకు చెప్తాను."

"సరేలే. ఇక పోదాం. గొప్ప కబురు అందజేశావు."

"కాదేమిటి మరి?" అంటూ లేచాడు రామం.

* • *

విజయ దాదాపు ఆ రాత్రంతా ఆలోచనలతో జాగారం చేసింది. శ్రీనివాస్‌తో ఇంటర్వ్యూ! తలచుకొంటున్నకొద్దీ ఆశ్చర్యం కలుగుతూంది. విచిత్రం అనిపిస్తోంది. శ్రీనివాస్! అందమైన పేరుకదూ? తగినట్టే సుందరమైన రూపం! కుడిచేతి షర్టుమడత లమీద ఎడంచేయి దండ కట్టుకుని నుంచుంటే వాచీగ్లాస్ తళతళా మెరుస్తూ ఠీవిగా, దర్జాగా— అబ్బా! ఏం హుందాతనం! సూటిగా నిశితంగాచూసే చురుకైన కళ్ళు! పాపిడిలేకుండా మేడమెట్లమాదిరి పైకి పైపైకి—పోయే కారు నల్లటిజుట్టు. ఎంతయినా నిజమైన సౌందర్యం మగవాడిదే — శ్రీనివాస్! అక్షరాల శ్రీనివాస్! వధువుతో ఇంటర్వ్యూ కోరుతున్నాడా? ఏం అడుగుతాడటా? అంత దర్జాగల వ్యక్తిని ఏం సమస్యలు బాధిస్తున్నాయి? ఈ ఇంటర్వ్యూతో అన్నీ పరిష్కారం చేసుకుంటాడా?... తను అతనితో—ఏకాంతంగా మాట్లాడుతుందా?....అసలు మాట్లాడగలదా? అతనికి నచ్చితే.. ? పెళ్ళిచేసుకుంటాడా? ఎంత విడ్డూరంగా వుందీ విషయం! వివాహం నిర్ణయించుకోవడం అంత సులభమా? విజయకు శ్రీనివాస్‌నూ, అతని నిర్ణయాలను తలచుకొంటూన్నకొద్దీ సిగ్గుకన్నా సంభ్రమం ఎక్కువ కాసాగింది. పెళ్ళి అంటే అతనికి ఎంతటి పవిత్రభావం ఉందీ? అవునుకదూ? పెళ్ళి ప్రతివ్యక్తికీ తప్పనిసరి సంఘటన. దాంపత్యం రెండు జీవితాలకు అపురూపమయిన బాంధవ్యం! కష్టసుఖాలను నిర్ణయిస్తూ నిండు జీవితాలను పరిపాలించేది పెళ్ళి! అందుకే అతను అంత గాఢంగా నిర్ణయించుకున్నాడేమో! "భగవాన్ చిన్నదాన్ని నేను చేసే ఈ సాహసాన్ని మన్నించి ఆశీర్వదించు!"

* * *

విశాలమూ, పరిశుభ్రమూ అయిన గదిలో శ్రీనివాస్ ఒంటరిగా సోఫాలో కూర్చుని ఉన్నాడు. మనసంతా ఆలోచనలు అల్లిబిల్లిగా అల్లు కుంటున్నాయి. నేడు జీవితానికి ప్రాతిపదికవంటి కళ్యాణం నిర్ణయించు కునే ఈ సమయం—భవిష్యత్తును శాసించే ఈ ఘడియలు .... ఏమౌ తుంది? విజయవంటి అమ్మాయినే నేమో తానుకోరుతున్నది. విజయలో ఏదో విశిష్టత గోచరించింది తనకు— ఈ నాటికి తన కోరికలన్నీ రూపు ధరించి విజయగా....

"నమస్తే!"

ఆలోచనలో కలవరపడ్డాడు శ్రీనివాస్. విజయ గుమ్మంలో నిలబడి ఉంది. చిరునవ్వుతో లేచి నిలబడి— "రండి" అంటూ గౌరవ పూర్వ కంగా ఆహ్వానించాడు. విజయ వచ్చి టేబిల్ ప్రక్కన కుర్చీలో కూర్చుంది. శ్రీనివాస్ విజయ వేషభాషలు చాల సున్నితంగా పరిశీలించ సాగాడు. అందమైంది. నిరాడంబరంగా ఉంది. క్రిందటి ఘడియ వరకూ ముక్కూ మొహం ఎరగని ఒక పరాయి వ్యక్తి ఎదుట తన వివాహ విష యాలు సంప్రదించుకోటానికి కనీసం కళ్ళలో కలవరపాటైనా కన్పించ నీయకుండా గంభీరంగా కూర్చుంది. ఏమైనా అలంకరించుకొందా? అని పించలేదు. తెల్లటి నుదుట సన్నని కుంకుమరేఖ దిద్దుకొంది. నల్లటి బారెడుజడలో ఒకే ఒక ఎర్రగులాబి ఉంచుకొంది. మృదువైన చేతులకు నిండుగా గాజులు వేసుకొంది. తెల్లని శరీరంమీద మరీ తెల్లనిచీర ధరిం చింది. మర్యాద సూచకం కాబోలు — పల్చటి పైటకొంగు కుడిచేతి మీదుగా తీసుకొని మెడ కొంచెంపక్కకివంచి నేలకేసిచూస్తూ కూర్చుంది. విశేషమేమిటంటే విజయ అలంకరించుకున్నట్టుగాక అవి అన్నీ తనకు సహజమే అన్నట్టు కన్పించింది. విజయలో ఎక్కడా వెర్రితలలు వేసిన నవనాగరికత తాలూకు లక్షణాలు మచ్చుకైనా కానరాలేదు. చంద్రబింబం వంటి ఆ మొహంలో ఏదో కళ.... అద్దాలవంటి ఆ చెక్కిళ్ళలో ఏదో అందం .... శ్రీనివాస్ తృప్తిగా ఫీలయ్యాడు. ఇటువంటి రూపురేఖలే తను కోరేది. విజయతో ఎన్నో విషయాలు మాట్లాడాలి. మంచి చెడ్డ

లన్నీ విపులంగా తెలియపరచాలి. ముఖ్యంగా విజయకు తాను అర్థం కావాలి. విజయ కూడా ఇలాగే ఆలోచిస్తుందా ?

"విజయా!"

విజయ తలఎత్తి చూసింది చాల మంచిగా "చెప్పండి" అన్నట్టు. విజయ శ్రీనివాస్‌తో మాట్లాడటానికి సిద్ధంగా ఉంది.

"రామం నా గురించి మీకు చెప్పి ఉంటాడు."

"చెప్పారు" విజయ కంఠధ్వనిలో సరళత గోచరించింది. శ్రీనివాస్ క్షణం ఆగాడు. "ఈ ప్రసంగంలో నా కెంత బాధ్యత ఉందో మీకూ అంతే వుంటుంది విజయా! ఈ క్షణం వరకూ మనలో ఎటువంటి నిర్ణయాలూ లేవు. కాబట్టి ప్రతి విషయం చాలా లోతుగా ఆలోచించి మీ మనసుకి నచ్చిన విధంగా నిర్భయంగా, నిర్మొహమాటంగా మాట్లాడాలండి. అదే నేను కోరేది. ఇది మన జీవితాలకు సంబంధించిన ఘట్టం. ఎవరెన్నెవరు మోసగించినా తర్వాత మనమే అశాంతి పాలవాల్సి ఉంటుంది."

విజయ శ్రద్ధగా వింది.

"ఈ ఇంటర్వ్యూకి మీరు మనస్ఫూర్తిగా అంగీకరించారా? లేక మీ వా రెవరయినా ...."

"లేదు. నన్నెవరూ ఒత్తిడి చేయలేదు. నేను మనస్ఫూర్తిగా అంగీకరించాను."

"ఎందుకు అంగీకరించారో కారణం చెపుతారా?"

"మీ కోరిక నాకు నచ్చి అంగీకరించాను. ఒట్టి చూపులకంటే పరస్పరం మాట్లాడుకోవటంలో ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. నేనే అలా నిర్ణయించుకొంటే నా కోరిక తీరుతుందనే నమ్మకంలేదు. కాని వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చుకదా? అందుకే అంగీకరించాను."

"నా కోరిక మీకు సమంజసంగా తోచటం సంతోషం విజయా! ఈ ప్రసంగానికి ఇద్దరి దృష్టిలోనూ విలువ వుంటుంది."

విజయ శ్రీనివాస్ మొహంలోకి చూస్తూ అంది—"నిజానికి ఇది విన్నప్పుడు కొంత జంకాను. కాని తర్వాత బాగా ఆలోచించి ధైర్యం చెప్పుకున్నాను."

"ఇందులో మీరంత భయపడవలసిం దేమీ లేదు విజయా! ఇది పరీక్షలకు హాజరవట మేమీ కాదుకదా! మన అభిప్రాయాలు ఒకరివి ఒకరం తెలుసుకుంటాం అంతే. నిండు జీవితాన్ని నిర్ణయించుకొనే ఈ సమయంలో ఈమాత్రం ధైర్యం చేయగలగాలి". విజయ మందహాసం చేస్తూ అంది—"దైవ ప్రేరణ లేకుండా మీ జీవితాన్ని మీరే నిర్ణయించుకోగల రనుకుంటున్నారా?"

"అది వేరే సంగతి. సుఖమైనా దుఃఖమైనా భగవంతుడు ప్రసాదించా డనుకొనేదానికన్నా నాకు నేను చేసుకున్నా ననుకోవటంలో సంతృప్తి వుంటుంది. నేను వధువుతో మాట్లాడి తీరాలని నిర్ణయించుకోటానికి కారణం నా జీవితాన్ని సుఖమయం చేసుకోవాలనే కోరిక. నా పరిస్థితులు, నా మంచి చెడ్డలు వివరంగా వధువుకి తెలియాలి. పరస్పరం ఏకీభవించాలి. ముసుగులో వ్యవహారంగా ముందు పెళ్ళితతంగం జరిగిపోయిన తర్వాత ఒకరి మనసు ఒకరికి పడకపోతే బాధపడి ప్రయోజనం లేదు. జీవితాన్ని నేనంత తేలికగా తీసుకోను. వింటున్నారనుకుంటాను" శ్రీనివాస్ విజయ కళ్ళలోకి చూస్తూ ఆగాడు. విజయ చూపులు దించుకుంది. "వినటమేకాదు. చెప్పండి. అర్థంచేసుకోవటానికి ప్రయత్నిస్తాను" అంది వినయంగా. విజయ ప్రవర్తనలో మర్యాద చిహ్నాలేగాని అవివేకంగా సిగ్గుపడి చిరాకుపెట్టే లక్షణాలేమీ లేవు. శ్రీనివాస్ ప్రారంభించాడు — "మాకు నాన్నగారు లేరు. ఇంటికి నేనే పెద్దవాడిని. అమ్మ వుంది. ఆవిడ కోడలు కావాలని కలవరపడుతూంది. తర్వాత విధవ అక్కయ్య ఒకావిడ వుంది. ఆవిడకు భర్త తరఫు కొంత ఆస్తి వుంది. నాలుగు సంవత్సరాల కూతురువుంది. ఆవిడ కొన్ని సంవత్సరాల వరకూ పుట్టింటే వుండవలసిన వ్యక్తి. నాతర్వాత చెల్లి కాపురం చేసుకొంటూంది. పుట్టిం

టికి వస్తూ పోతూ వుంటుంది. తమ్ముడు ఈ సంవత్సరమే మెడిసన్‌లో జాయినయ్యాడు. ఆఖరిచెల్లి నాలుగోఫారం చదువుతోంది దానికి తగినంత చదువు చెప్పించి పెళ్ళి చెయ్యాలి. ఇదీ మా కుటుంబం. అందర్నీ మీకు పరిచయం చేశాను."

విజయ మౌనంగా వింది.

"వాళ్ళందరికీ నేనే పెద్దను. అంటే ఆ కుటుంబ బాధ్యతలన్నీనావే. అమ్మనూ, అక్కయ్యనూ చూడాలి. తమ్ముడ్ని ప్రయోజకుడ్ని చెయ్యాలి. చెల్లెళ్ళను సంతోషపెట్టి పంపుతూండాలి. విజయా! ముందు నా బాధ్యతలు మీరు అర్థం చేసుకోండి."

"అవును. దేనినీ మీరు కాదని తప్పించుకోటానికి వీల్లేదు."

"అలా ఎన్నడూ చెయ్యను. అదే నేను చెప్పబోయే విషయం. రేపు నాకు రాబోయే భార్య, పుట్టబోయే బిడ్డలూ, వీళ్ళేకాదు నాకు కావలసింది. నా కుటుంబం పెద్దది. మాఇంటికి రాబోయే కోడలు మొట్టమొదట సమిష్టికుటుంబానికి ఇష్టపడి పెద్దల్ని గౌరవించే వ్యక్తి కావాలి. కొంతవరకూ తన స్వార్థం విడిచి ఇంట్లో అందరి అభిమానాన్నీ పొంద గలగాలి. ముందు ఈ విషయంలో మీ అభిప్రాయం చెప్పండి విజయా!"

విజయ మౌనం వహించింది. శ్రీనివాస్ తిరిగి అన్నాడు—"మీరు పూర్తిగా ఆలోచించుకోండి. మీ అభిప్రాయం ఏదైనా నిర్మొహమాటంగా బయట పెట్టండి. మా సమిష్టి కుటుంబంలో బాధ్యతలన్నీ ప్రత్యక్షంగా నావిగా కన్పించినా పరోక్షంలో నా జీవితంలో పాలుపంచుకున్న వ్యక్తివే అవుతాయి. ఆవిడ ఆదర్శమూర్తిగా ప్రవర్తించి సంసారాన్ని సుఖమయం చేయవలసి వుంటుంది విజయా! మీ శక్తి మీరే అంచనా వేసుకోండి. చాలమంది అమ్మాయిలు అత్తా, ఆడబిడ్డలూ అనే ఎటువంటి అడ్డంకులూ లేని ఒంటరి కాపురాలను కోరుకుంటారు. అటువంటి వ్యక్తి ఒకావిడను నేను ఎరుగుదును. ఆవిడ ఉమ్మడి కుటుంబాలతో బాధ్యతలు నిర్వహించేటంతటి శక్తిమంతురాలు కాదట. పెళ్ళి జరిగాక వేరుకాపురం కావాలని బాధపడితే ఏం చేయాలి? ఒకవిధంగా అదికూడా ఆవిడ నేరం కాదేమో

సమిష్టి కుటుంబంలో కోడలికి చాల ఓర్పు—సహనం-క్షమాగుణం- స్వార్థ త్యాగం... పెద్దమాటలు చెపుతున్నానని అనుకోకండి. నిజానికి అటువంటి భావాలన్నీ ఆమెలో వుండాలి. మీ శక్తి సామర్థ్యాలు...."

మాటలలో అడ్డుతగిలి చిన్నగా నవ్వుతూ అంది విజయ—"అంత లేసి గొప్ప లక్షణాలు నాకు ఉన్నాయని నేను అననుగాని సమిష్టి కుటుంబాన్ని గురించి ఏవిధంగానూ నేను అయిష్టపడను. నాకూ కొన్ని లక్షణమైన బాధ్యతలు స్వీకరించవలసిన అవసరం వస్తే మనస్ఫూర్తిగా సంతోషంతో అంగీకరిస్తాను. నేనూ పదిమందిగల కుటుంబంలో పుట్టి పెరుగుతూన్న దానినండి" విజయ మాట్లాడుతూన్న ప్రతి మాటా వేయి చెవులతో విన్న శ్రీనివాస్ ముఖంలో సంతోష రేఖలు వెల్లివిరిశాయి.

"విజయా మీరు జాగ్రత్తగా ఆలోచించే మాట్లాడుతున్నారా? కావాలంటే కొంత టైం తీసుకున్నా...."

"అవసరం లేదండీ! కనిపెంచిన తల్లినీ, తోడబుట్టిన తోడునూ దూరం చేసుకోమని అడిగే ఆడదాన్ని కానే!" విజయ కన్నుల్లో గర్వం తొణికిసలాడింది.

"విజయా! చాల సంతోషం. నేను భయపడుతున్నది ప్రత్యేకంగా ఈ విషయం గురించే. ఇంటి కోడలి మంచితనమే ఆ ఇంటికి సుఖ శాంతులు ప్రసాదిస్తుంది."

విజయ శ్రీనివాస్ మొహంలోకిచూస్తూ నిర్మొహమాటంగా అంది. "ఇంటిని స్వర్గంచేసే బాధ్యతంతా ఒక్క ఇంటికోడలిదే కాదు. ఇంటిలో ప్రతి వ్యక్తికీ సంబంధించి వుంటుంది." విజయ మాటల్లో శ్రీనివాస్‌కు ఎన్నో భావాలు అర్థమయ్యాయి. మిగిలినవాళ్ళంతా చెడుగా ప్రవర్తించి ఒక్క కోడలు మాత్రం గుణవంతురాలయితే ఇల్లు స్వర్గం ఎలా అవుతుంది? ఇది విజయ అనుమానం.

"మీ రన్నది అక్షరాలానిజం. కోడలిని ఒక దాసీమనిషిలా చూస్తూ సంతోషపడే సంసారాలు చాలా చూస్తూంటాం. కాని విజయా మాఇంట్లో వ్యక్తులంతా చదువు సంస్కారం లేనివాళ్ళు కారని గర్వంగా చెప్పగలను.

మా యింటికి రాబోయే అమ్మాయిని నా భార్యగా ఇంటి కోడలిగా అభిమానించి గౌరవిస్తారు. కోడలంటే బానిసకాదు విజయా. బాధ్యతలు ఉన్నట్టే ఆవిడకు హక్కులూ ఉంటాయి. అమ్మ పర్యవేక్షణలో ఆవిడే ఇంటి యజమానురాలౌతుంది. ఆవిడకు ఆ స్థానం నేను కల్గిస్తాను.... ఇప్పుడు మీ అభిప్రాయం చెప్పండి!"

విజయ నవ్వి అంది — "నేను చెప్పేశాను."

శ్రీనివాస్ సంతోషమంతా కళ్ళలో వ్యక్తపరుస్తూ చూస్తూంటే విజయ ఇబ్బంది పడింది.

శ్రీనివాస్ ముందుకు సాగిపోయాడు. "అయితే తర్వాత విషయం. నెలకు నా జీతం మూడువందలూ గాక సంవత్సరానికి భూములమీద రెండువేలలోపు ఆదాయం వస్తుంది. పేరుకుమాత్రం నేను ఆఫీసరునుకాని మా కుటుంబం చాలా నిరాడంబరంగా గడుస్తుంది. ఆఫీసరు భార్యనని ఏమైనా ఆశలు పెట్టుకొంటే మాత్రం నిరాశ పొందవలసి వస్తుంది. ఈ విషయంకూడా మీ ఇష్టానికి సరిపోవాలి కదా?"

విజయ ఆ విషయం చాలా తేలికగా తీసుకుంది. "కనీసపు అవసరాలకు లోటు కలగకపోతే సంతోషమే. నేను చిన్నతనంనుంచీ పెద్ద పెద్ద హోదాలకు అలవాటుపడి లేను."

"ఒక్క బయటి విషయాలే కాదనుకోండి. ఇంటి పనిపాటల సంగతి కూడా...." శ్రీనివాస్ ఆగిపోయాడు. కాని విజయ అర్థంచేసుకొని అతని సిర్మొహమాటానికి నవ్వుకొంది. "ఆ విషయంలో మీరేమీ భయపడకండి. నాకు ఇంటిపనులన్నీ చేయటం వచ్చు. నేను వెళ్ళినచోట నౌకర్లూ చాకర్లూ వుండాలని ఎప్పుడూ అనుకోలేదు" అంది నవ్వుతూ.

శ్రీనివాస్‌కూడా నవ్వి అన్నాడు— "సంతోషం విజయా! నేను అడగాలనుకొన్న విషయాలు పూర్తయ్యాయి. ఇక మీ అభిప్రాయాలు తెలుసుకోవాలి. నన్ను ఏది అడగాలని ఉన్నా అడగండి. అన్యథా భావించను."

విజయ ఏమీ మాట్లాడలేదు.

శ్రీనివాస్ కొంతసేపుచూసి— "నన్నేమీ అడగాలని అనుకోలేదా! మీకు కొన్ని ఉద్దేశ్యాలుంటాయి. అవి నేను అంగీకరించాలికదా? పోనీ

కొంతవరకూ నే నడుగుతాను చెప్పండి. మీరు ఎక్కువ సమయం ఎలా వినియోగిస్తూ ఉంటారు? మీకు ఏ ఏ పనులంటే ఎక్కువ ఇష్టం?" అంటూ విజయను గురించిన సమాచారం ప్రారంభించాడు.

"నేను ఎక్కువ పుస్తకాలతోనే కాలక్షేపం చేస్తూ ఉంటాను. ఇంటిపనులు చెయ్యటంకూడా నాకు ఇష్టమే."

"సినిమాలూ—షికార్లూ?"

"మితంగా. అటువంటి విషయాల్లో మితిమీరిన మోజులు మా ఇంట్లో ఎవరికీ లేవు."

"మీకు మీ భవిష్యత్ గురించి కొన్ని ఆలోచనలు లేవా?" శ్రీనివాస్ సూటిగా అడిగాడు.

విజయ నవ్వింది. "ఎందుకులేవు? ఉన్నాయి. అవి ఇప్పుడు అడగకపోయినా మీరు అంగీకరిస్తారనే అనుకొంటున్నాను!"

"ఎందుకంత నమ్మకం నామీద మీకు? అలా అనుకుంటే కాదు. అవేమిటో విపులంగా చెప్పండి. ఇద్దరికీ మంచిది." శ్రీనివాస్ ఒక తీడి చేస్తున్నట్టు అన్నాడు. విజయ అడిగింది —"రేడియోలో నా పాట లెప్పుడయినా విన్నారా?"

"వినే వుంటాను. కాని మీ పాటలనే ప్రత్యేకతతో కాదు. మొన్న రామం మీరూ కలిసి పాడినప్పుడు విన్నానుకదా స్టేషన్‌లో. — చాలా చక్కగా ఉంది అనుకున్నాను."

"నేను ఎప్పుడు రేడియోలో పాడినా, నాటికలో పాల్గొన్నా మీకు అభ్యంతరం ఉంటుందా?"

శ్రీనివాస్ క్షణం ఆలోచిస్తున్నట్టు ఊరుకున్నాడు. "నాకు వేరే ఏమీ అభ్యంతరం వుండదు. కాని ఈ దశలో మీకు వీలయినట్టు రేపు శ్రీమతి అయిన తర్వాత కూడా జరుగుతుందని అనుకొంటున్నారా?"

"చాలవరకు ఒక లక్ష్యం పెట్టుకున్నవారికి వీలుగాకపోవటం ఉండదనుకోండి. అంత తీరనినాడు నేనే సరిపెట్టుకుంటాను. మరి మీరు అభ్యంతరం పెట్టకపోయినా మీ పెద్దలు ...."

"లేదు విజయా! మా అమ్మా, అక్కయ్యా అంతా చదువుసంధ్యలను గౌరవిస్తారు. మీరు చక్కని గాయకురాలయితే అందరికీ సంతోషమే కదూ ?"

"సంతోషం" అంది ముక్తసరిగా విజయ.

"ఒక్కమాట. మీ ఈ అభిప్రాయాన్ని-అంటే ఇకముందు మీరు రేడియోలో పనిచెయ్యటాన్ని నేను ఇష్టపడనంటే నన్ను తిరస్కరించే వారా?"

"ఎందుకా విషయం ?"

"కావాలి. మీ కోరిక ఎంత బలమైనదో తెలియాలి."

"లేదు. మీరీ విషయాన్ని అంగీకరించకపోతే బాధపడి ఊరుకొనే దాన్ని గాని మిమ్మల్ని తిరస్కరించేదాన్ని కాను."

"ఎందుకని ?"

"మీవంటి సంస్కారులే ఇంత సామాన్యమైన కోరిక అంగీకరించలేనప్పుడు ఇక అది తీరే మార్గం లేదుకదా ? దాన్నే విసర్జిస్తాను." శ్రీనివాస్ నవ్వాడు—"చిత్రంగా మాట్లాడుతున్నారు. మీరు బాధ పడవద్దు విజయా! మీ కోరికలను నేను మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. సాధ్యమైనంతవరకూ మీ అభివృద్ధికే ప్రయత్నిస్తాను."

విజయ కన్నుల్లో కృతజ్ఞతాభావం పొడసూపింది. "తర్వాత విషయం-మీరు అన్యథా భావించకపోతే నేను ఒకటి అడుగుతాను. నేను ఏ విధమైన అపవిత్రతనూ సహించలేను. జీవితం కొన్ని సుగుణాలతో ఆదర్శాలతో గడపాలని ఆశపడుతున్నాను. మరేమీ అనుకోకండి. చాలమంది ఆఫీసర్సులో లంచగొండితనం ఉంటుందని విన్నాను. మీరు...." విజయకు మాటలుదొరకనట్టు ఆగిపోయింది. శ్రీనివాస్ గర్వంగా నవ్వాడు.

అంతలోనే విజయ తిరిగి అంది. "ఈనాడు ఏ విషయమైనా మీరు మరుగుపరిస్తే భవిష్యత్తులో మీరు కోరుకుం శాంతి మీకు లభించక పోవచ్చు నా మనసు గాయపడితే...."

"విజయా!" శ్రీనివాస్ గొంతులో కొంత తీవ్రత ధ్వనించింది. "ముందు నా మనసు మీరు గాయపరుస్తున్నారు. మీ నీతి నియమాలకు సంతోషం కానీ అవి మీకేకాదు నాకూ ఉన్నాయి. మీ అనుమానాలకు నా

జవాబు వినండి. లైఫ్ ఇన్సూరెన్స్ డిపార్టుమెంటులో లంచాల ప్రసక్తి లేదు. భగవంతుడి దయవల్ల నీతిగా బ్రతకగలిగే ఉద్యోగమే దొరికింది. అంతేకాదు. నా తల్లి మీద ప్రమాణంచేసి చెప్తాను. నన్ను నమ్మండి. నేను సిగరెట్లు కాలుస్తాను, ఎక్కువగానే కాలుస్తాను. తగ్గించుకోవాలనే కోరిక నాకూ ఉంది. తర్వాత పేకాడుతూ ఉంటాను. అప్పుడప్పుడు స్నేహితుల కోసం మాత్రం. మితిమీరి ఎన్నడూ ప్రవర్తించలేదు. ఇక వ్యభిచారం త్రాగుడూ అనే లక్షణాలు నేను ఎరుగను. ఇవన్నీ మీరు నమ్ముతారా?"

విజయ మాట్లాడలేదు శ్రీనివాస్‌ని విసురుపాటుగా చూస్తూ కూర్చుంది. కొన్ని క్షణాలు గడిచాయి. "ఇంకేమీ అడగనక్కర్లేదా?" అన్నాడు శ్రీనివాస్. విజయ నవ్వుతూ అంది—"అడగటం అలా ఉంచండి మీకు కోపం ఎక్కువనుకుంటాను."

శ్రీనివాస్ సిగ్గుపడి నవ్వేస్తూ — "ఫర్వాలేదు. మీరు శాంత పరులుగా!" అన్నాడు.

"తర్వాత విషయం— కుటుంబ నియంత్రణం గురించి మీ అభిప్రాయం?"

"అంటే?"

"అంటే అది మీ భవిష్యత్తులో ఆచరణలో పెట్టదల్చుకున్నారా?"

"ఎంత ముందుచూపు" అప్రయత్నంగా అనేశాడు శ్రీనివాస్. విజయ చాలా సిగ్గుపడింది. "క్షమించండి. నేను అడిగిన విషయం సున్నితంగా లేదేమో!"

"అదేమీకాదు. మీకెందుకా అనుమానం వచ్చింది? నేను పూర్వం మనిషిని కానుగా పూర్వం చాదస్తాలు పోవటానికి?"

"అయినా వెనకవుండే పూర్వపువ్యక్తుల ఒత్తిడిలో ధైర్యం చెయ్యలేక జీవితాలను నరకంచేసుకుంటున్నవాళ్ళను చాలమందిని చూస్తున్నాం."

"వాళ్ళు తెలివి తక్కువవాళ్ళు విజయా! నేనెంత బరువు మోయగలనో నిర్ణయించుకోవలసింది నేను. అంతే. తర్వాత అడగండి."

"మరి లేవు."

"బాగా ఆలోచించుకున్నారా? అయితే ఏం నిర్ణయించుకున్నట్టు."

"అది మీకు తెలియాలి."

"అయితే వినండి. నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకొని అర్ధాంగిగా చేసుకోటానికి ఇష్టపడుతున్నాను. దానికి కారణాలు మీ అందం, గుణం వివరించాలంటే చాలచెప్తాను. సమయం ఇదికాదు" విజయ మందహాసంలో సిగ్గు తెరలు కదిలాయి.

"మరిమీరు నన్ను ఎందుకు అంగీకరించారో చెపుతారా?"

"ఇవీ మీరుచెప్పిన కారణాలే. మీ అందం, గుణం నాకునచ్చాయి. మీవంటి సంస్కారులు అరుదు. నేను పెళ్ళిగురించి ఎక్కువగా ఎన్నడూ ఆలోచించలేదు. కాని ఏవో విశిష్టతలు గల వ్యక్తి నా భర్తగా లభించాలని మనసు కోరుతూ ఉంటుంది. ఆ వ్యక్తి మీరే కాబోలు" అంది విజయ కొంత హాస్యంగా.

శ్రీనివాస్ పెదవులమీద హాస్యం మెరిసింది–"నాకు చాలా సంతోషంగా వుంది విజయా! నా ప్రయత్నంలో ఇంత దిగ్విజయం లభిస్తుందని అనుకోలేదు. ఆశించినదానికన్నా మిన్నగా ఫలితం పొందాను. క్రిందటి గంటవరకూ నా పెళ్ళి ఒక సమస్యలా తయారై నన్ను భయపెట్టింది. అంతా నా పెళ్ళిగురించి అడిగేవాళ్ళే. అంతా హెచ్చరించేవాళ్ళే. నాకూ తెలుసు. నేను పెళ్ళి చేసుకోవాలి. కాని ఎవరా వ్యక్తి? ఎక్కడుంది? నాకు ఒకటే కోరిక. ఆవిడ రాకతో సంసారంలో ఎటువంటి కలతలూ తలఎత్తకుండా సుఖమయంగా సాగిపోవాలి. అలాగే జరుగుతుందని ఎవరయినా హామీఇస్తే తప్పకుండా పెళ్ళిచేసుకుంటాను. చిలకా–గోరువంకా అంటారే అలా సినిమాలూ షికార్లూ–ఆటలూ–పాటలూ–ఎంచక్కా ఉండదూ? నేనేమీ దురాశలకు పోవటంలేదే! అయినా నన్ను అర్థం చేసుకోగలిగే వ్యక్తి లభిస్తుందా? అంతమంచి గుణం, సంస్కారంగల అమ్మాయిలుఉన్నారా? అంటే అటువంటి గుణవతిని భార్యగా పొందగలిగేటంత అదృష్టవంతుడినా? ప్రతిక్షణం ఎన్నో ఆలోచనలతో గడిపేవాడిని. కాని నా నిరీక్షణ వ్యర్థంకాలేదు. నా ఆశ నిరాశ కాలేదు. నాకు ఎంతో సంతోషంగా ఉంది విజయా! ఈనాటికి పద్మావతి లభించింది."

"పద్మావతి! ఆవిడెవరు?"

"శ్రీనివాస్ భార్య."

"ఓ! అదా?" అంటూ నవ్వింది విజయ.

"ఏం? మీకు అసూయ కలిగిందా ?"

"కాదా మరి ?"

"అంత తొందరగా అభిప్రాయాలు ఏర్పరచుకోకండి విజయా! మీవంటి భార్య—నేను అదృష్టవంతుడ్ని కదూ ?"

"దయచేసి ఇక నన్ను మన్నించండి. తర్వాత మీ అదృష్టంలో నాకూ వాటా కేటాయించండి."

శ్రీనివాస్ నవ్వాడు. "చాలా గడుసుదానివి విజయా !"

"మీకంటేనా !"

శ్రీనివాస్ చూపులు తప్పించుకొంటూ విజయ లేచి నిలబడింది. "మరి నేను వెళతాను. నమస్తే."

"భార్యకు భర్త తిరిగి నమస్కరించకూడదట."

"ఎవరన్నారటా ?"

"పెద్దలు."

"ఓహో! పెళ్ళికూతురితో మాట్లాడి మరీ పెళ్ళి చేసుకోమన్నారా పెద్దలు ?"

"మర్చిపోయి ఉంటారు."

"అవునవును. గడుసువాళ్ళకు అనుకూలంగా ప్రవర్తిస్తూ ఉంటారు పెద్దలు. మరి నేను వెళతాను."

"ఎవరూ వెళ్ళనక్కరలేదు కూర్చోండి. రామం ఇందిరా ఇక్కడికే వస్తారు. ఒరేయ్ రామం" అంటూ గట్టిగా పిలిచాడు శ్రీనివాస్. విజయ సిగ్గుపడి తిరిగి కూర్చుండిపోయింది. రామం ఇందిర నవ్వుతూ గదిలో కొచ్చారు చదరంగం పావులడబ్బా తీసుకొని.

"నీ ఇంటర్వ్యూ ఏమైందోగాని మా ఆయనతో ఆడిన ఆటలలో మాత్రం నేనే గెలిచానన్నయ్యా!" అంది ఇందిర నవ్వుతూ.

"ఉత్తదిరా. అంతా దగాచేసి గెలిచింది."

"బావుంది. మీకు కళ్ళులేవేమిటి ?"

"ఉంటే ఏంలాభం. ఆటమీద లేనప్పుడు! బావగారేం తిప్పలు పడుతున్నారో చూడాలన్న ధ్యాసేనయ్యే !"

"ఇంతకూ చూశావా ?" శ్రీనివాస్ నవ్వాడు.

"లేదులే అన్నయ్యా! అందుకే ఈ కంగారంతా. ఇంతకూ ఏమైందో చెప్పవేం?"

"ఇంకేమైంది? అదిగో ఆవిడ మీ వదినైంది" శ్రీనివాస్ విజయ కేసి చూసి నవ్వాడు.

"అయితే మాత్రం అప్పుడే పెళ్ళికూతురిలా తలదించుకొందేమిటి?" అంది ఇందిర విజయను వేళాకోళంచేస్తూ.

"మరి కాస్త ప్రాక్టీసు చేసుకోవద్దా?" శ్రీనివాస్ ఛలోక్తికి ఇందిర పక్కుమంది. విజయ లేచి నిలబడి—

"ఏయ్ ఇందిరా! జరగబోయేవన్నీ ముందే ఆలోచించుకోటాలూ—ప్రాక్టీసు చేసుకోటాలూ నీకూ నీ అన్నగారికి అలవాటు. మాకుగాదు. మేము ఏ సమయాకు ఎలా కావాలన్నా మారిపోగలం."

"బాగా చెప్పావ్ చెల్లాయ్! అయితే బావగారూ! మీకు మేముచేసిన ఉపకారానికి మీరు మాకిచ్చే ప్రతిఫలం ఏమిటి?" రామం అన్నాడు.

"నా శక్తికి మించని విధంగా మీ ఇష్టమైంది అడగండి. సంతోషంతో ఇస్తాను. అప్పుడైనా మీ ఋణం తీర్చుకోలేనేమో!"

"అయితే అడుగుతున్నాను అన్నయ్యా! మా నానిగాడితో ఆడుకొనేందుకు చిన్న ఆడ.... బొమ్మ కాదుసుమా ... పాప ... సంవత్సరం గడువు."

"హో! అదైతే నన్నుగాదు. మీ వదినను అడగండి. ఆవిడ పెత్తనం."

విజయ ఎంత గంభీరమైనదైనా సిగ్గుపడిపోయింది. ఆ కళ్ళతో సిగ్గుదొంతరలు వెతుక్కొంటూ లేచి నిలబడ్డాడు శ్రీనివాస్.

* * *

పెద్దవారి ఇష్టప్రకారం విజయ పెళ్ళి శ్రీనివాస్‌తో నిర్ణయమైంది. నాయనమ్మ విజయ అదృష్టాన్ని వేనోళ్ళ పొగిడింది. కాని మరో సమస్య తెచ్చిపెట్టింది. విజయ పెళ్ళిలోనే శారద పెళ్ళి కూడా జరిగిపోవాలట. "విజయేమో గడసరిదీ తెలివైందీ కాబట్టి పెళ్ళిమానేసి చదువు చెప్పించినా ఫలితం కన్పించింది. శారదకు అంత గడుసుదనం లేదు. విజయలాగ అది చదువుసంధ్యల్లో పైకిరాదు. దానికి నోట్లో నాలికలేదు. పనిలో పని

ఇంటిదాన్ని చేసేస్తే గుట్టుగా కాపరం చేసుకుంటుంది. చదువు మాన్పిం చినా అది పేచీ పెట్టదు" అంటూ చెప్పుకొచ్చింది. "నిజమేనుమరిఅంటూ అమ్మ ఎప్పటిలా నాయనమ్మకు వంతపాడింది. శారదను "విజయక్కతో పాటు నువ్వూ పెళ్ళిచేసుకుంటావుటే?" అంటే అది తెలిసీ తెలీనట్టు ఓ నవ్వు నవ్వేసి జారిపోతూన్న ఓణి లాక్కుంటూ పరుగుదీసింది.

నాయనమ్మ ఆలోచనవిన్న విజయ అదిరిపడింది. శారదకు పెళ్లా? పధ్నాలుగేళ్ళ పసిదానికి మూడవ ఫారంలోనే చదువు మానిపించి శారదకు పెళ్ళిచేస్తారా? ఏం ప్రాణంమీది కొచ్చింది? పిచ్చి శారదకు అభమూ శుభమూ తెలీదు. దానికి ఇష్టాలూ అయిష్టాలూ లేవు. అందుకని దాని చదువు మాన్పిస్తారా? విజయ అమ్మతోనూ, నాయనమ్మతోనూ ఖచ్చితంగా చెప్పింది. శారదకు పెళ్ళిచేయటానికి వీల్లేదని, దాన్ని చదివించాలని, నాయనమ్మ ముందు మంచిగా మాట్లాడినా తర్వాత తగూలోకిదిగింది. తాచెడ్డకోతి వనమంతా చెరిపిందట. నీకు సాగిపోయిందని అందరికీ సాగిపోతుందంటే? ఆ వెర్రిబాగులి నీలా ఇరవై ఏళ్ళవరకూ ఎదిగికూర్చుంటే దానికి మొగుడెవడైనా వస్తాడటే? అందర్నీ నువ్వే ఉద్ధరిస్తావుటే?" అంటూ పురాణం తెరిచింది.

విజయ నాన్నగారితో సంప్రదించాలనుకొంది. విజయవెళ్ళి నాన్న గదిలో కూర్చుంది. టేబుల్ మీద పుస్తకం ఒకటితీసి పదినిమిషాలసేపు తిరగవేసింది.

"నాన్నా! శారదకు పెళ్ళి నిశ్చయిస్తున్నారట. దాని చదువు మానిపించేస్తావా?" అంది మౌనాన్ని భగ్నంచేస్తూ.

"అవును మరి. నాయనమ్మా వాళ్ళూ పట్టుపడుతున్నారమ్మా."

"అదేమిటి నాన్నా? అలా అంటావ్? పూర్వకాలంది నాయనమ్మ చెప్పినట్టే ఈకాలంలో జరగాలంటే ఎలా? పమిటైనా వేసుకోవటం రాని పసిదాన్ని చదువుమానిపించి పెళ్ళిచేసి కాపరానికిపంపటంఎంతఅన్యాయం నాన్నా? తలిదండ్రులచాటున ఆడుతూపాడుతూ కాలం గడపాల్సిన వయసు. అప్పుడే దాని బ్రతుకుమీద బాధ్యతలు మోపటం—పోనీ నీకు సమంజసంగా ఉందా నాన్నా?"

నాన్నగారు ఏమీ మాట్లాడలేదు చాలాసేపు. "శారద ఏమీ అనటం లేదట కదమ్మా! ఇష్టపడిందట కదూ?"

"ఇష్టపడింది నాన్నా! దానికి ఇష్టాలూ అయిష్టాలూ ఉన్నాయా? అసలు దానికి మంచేవిటో చెడేవిటో తెలుసా? ఒకవేళ దానికి అన్నీ తెలిసినా మీమాట ధిక్కరించే శక్తిలేక ఒప్పుకుందేమో! ఆనాడు ఎదిరించిన నన్ను మీరేం చెయ్యలేకపోయారు. అంతేనాన్నా మనుషుల్లో మంచితనం ఎన్నడూ దక్కదు."

"విజయా! ఏమిటమ్మా నువ్వు అనేది?"

"శారద పెళ్ళి జరగటానికి వీల్లేదు నాన్నా! మాటిమాటికి మీరు ఖర్చులు భరించలేకపోతే దానికి సరియైన ఈడువచ్చాక ఏ రిజిష్టరుపెళ్లో చేయండి చాలు. అది పెళ్ళికాదని ఎవరూ అనరు. నాకు చదువుకోవాలని ఎంతో కోరికవున్నా పరిస్థితులు అర్థంచేసుకొని నాకోరికనుచంపుకున్నాను. కాని ఈనాడు అన్నయ్యకూడా సంపాదిస్తున్నాడు. నేను వెళ్ళిపోతే ఇక ఇంట్లోవుండేది శారద ఒక్కతే. దాన్ని పెద్దచదువులు చదివించినా చదివించివచ్చును. అంత మంచి భవిష్యత్తు పాడుచేసి నాయనమ్మ మాట కోసం శారద బ్రతుకు నాశనంచేస్తావా నాన్నా?"

"నువ్వు ఇంతగా చెప్తుంటే అలాగేచేద్దాం విజయా! శారద పెళ్ళి ఆపుచేసి చదివిద్దాం. అంతేనా నువ్వు కోరేది?"

"నీకు సమంజసంగా లేదా నాన్నా?"

"నువ్వు ఏదిచెప్పినా చక్కగాఉంటుంది తల్లీ! నేనే అప్పుడప్పుడు పొరబడుతూ ఉంటాను."

విజయ సంతోషంగా—"నువ్వు మంచివాడివి నాన్నా! నేనువెళ్తాను. నేను చెప్పానని నాయనమ్మకు చెప్పకుసుమా! నన్ను తిడుతుంది" అంటూ లేచి వెళ్లిపోతూంటే తండ్రి కూతురువేపే చూస్తూ ఉండిపోయాడు.

విజయ! బంగారుతల్లి! ఏది తలిచినా సాధించి తీరుతుంది. విజయకు పరాజయమే లేదు; విజయ అపరాజిత.

(సమాప్తం)